# ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బీ గోపి
- సెక్టోరల్ అధికారులకు శిక్షణ

కలెక్టరేట్, అక్టోబర్ 18: అసెంబ్లీ ఎన్నికల విధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బీ గోపి అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం సెక్టోరల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలు తీసుకుని, విధుల పట్ల అంకితభావంతో ఉండాలని సూచించారు. సెక్టోరల్ అధికారి ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి, ఇతర వసతుల ఏర్పాట్లను పరిశీలించాలని ఆదేశించారు. ఈవీఎంలపై పరిపూర్ణ అవగాహన పెంచుకోవాలని, పీవోలు తాము నిర్వహించబోయే విధులపై నిబద్ధత ప్రదర్శించాలన్నారు. పోలింగ్ రోజు, అనంతరం సమర్పించే నివేదికలపై, ఈవీఎం పనిచేసే విధానంపై క్షుణ్ణంగా తెలిసి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, టాయ్‌లెట్లు, ఇతర వసతులు సమకూర్చుకోవాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా ఘటనలు జరిగితే, వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. ఈసారి ఎలక్టోరల్‌ను ఇంటి నంబర్ ఆధారంగా ఆల్ఫాబెటికల్ పరంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈవీఎం యంత్రాలను అధికారులు వారికి కేటాయించిన వాహనాల్లో తీసుకెళ్లాలని, అనుమతి లేని ప్రైవేటు వాహనాల్లో తరలించరాదని స్పష్టం చేశారు. పోలింగ్ రోజు ఈవీఎంలలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌వో పవన్‌కుమార్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీఈవో జనార్దన్‌రావు, మెప్మా పీడీ రవీందర్, పరిశ్రమల శాఖ అధికారి నవీన్, సెక్టోరల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ గోపి

***ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి***

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బీ గోపి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ మహిళా (ఎస్సీ) కళాశాలలో ఏర్పాటు చేసిన మానకొండూర్ నియోజకవర్గం డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్ కేంద్రాలను ఆయన అదనపు కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం కళాశాల పరిసరాలను పరిశీలించారు. వాహనాల పార్కింగ్ కోసం అవసరమైన స్థలాన్ని చదును చేయాలన్నారు. అలాగే, మానకొండూర్ తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సి-విజిల్, సువిధ, కంట్రోల్ రూంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి వద్ద గల చెక్ పోస్ట్ వద్దకు వెళ్లి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, తహసీల్దార్ కనకయ్య, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీలను రాజకీయంగా గుర్తించాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 18: పద్మశాలీ కులస్తులను రాజకీయంగా గుర్తించాలని తెలంగాణ పద్మశాలీ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వాసాల రమేశ్, జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం పేర్కొన్నారు. నగరంలోని పద్మశాలీ ట్రస్టు భవన్‌లో బుధవారం నిర్వహించిన పద్మశాలీల రాజకీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. అన్ని పార్టీలు పద్మశాలీలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పద్మశాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, నాయకులు మల్లేశం, భద్రయ్య, శ్రీరాములు, దూడం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దుర్గాదేవీకి ప్రత్యేక పూజలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 18: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పలు మండపాల్లో, ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమివ్వగా, కూష్మాండం, చీరెలతో అలంకరించారు. హౌసింగ్ బోర్డు కాలనీలో డెకరేషన్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి రూ. 5 లక్షల కరెన్సీతో విశేషాలంకారం చేశారు. అంతకుముందు పోచమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. పలు మండపాలను మేయర్ వై సునీల్ రావు సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

***కనుల పండువగా పల్లకీ సేవ***

8వ డివిజన్ (అల్గునూర్)లో ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు. భవానీ దీక్షా పరులు నృత్యాలు చేస్తూ భక్తితో పరవశించారు.

రామడుగు, అక్టోబర్ 18: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నవయుగ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవీ మండపంలో బుధవారం భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నవయుగ యూత్‌క్లబ్ అధ్యక్షుడు ఎడవెల్లి ఆనందంరెడ్డి, సభ్యులు పైండ్ల గంగయ్య(కపిల్), పొన్నం లింగస్వామి, కరుణాకర్, సిరిపురం మల్లేశం, పైండ్ల శివ, ముదుగంటి మల్లారెడ్డి, దాసరి మునీందర్‌రెడ్డి, అజయ్, జాలి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ సస్పెన్షన్

రాంనగర్, అక్టోబర్ 18: కరీంనగర్ పోలీస్ హెడ్ క్వార్టర్, ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ వీ రాజును ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా చెక్ పోస్ట్ వద్ద నియమించగా, అధికారుల ఉత్తర్వులు పాటించకుండా, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించినందున, విచారణ జరిపి బుధవారం సస్పెండ్ చేసినట్లు కమిషనర్ సుబ్బారాయుడు తెలిపారు. ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్‌లోని అన్ని స్థాయి అధికారులందరూ ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాలని, విధులపై నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలతో పాటు ఎన్నికల నియమావళి అనుసారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అసంక్రమిత వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి, పాల్గొన్న అధికారులు

విద్యానగర్, అక్టోబర్ 18: అసంక్రమిత వ్యాధుల నివారణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డీఎంహెచ్‌వో డా.లలితాదేవి తెలిపారు. నగరంలోని డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానలు, వెల్‌నెస్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులతో ఆరోగ్య కార్యక్రమాలపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్షయ నివారణ, మాతా శిశు సంరక్షణ, ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్‌పై పూర్తిస్థాయిలో సమీక్షించి, వైద్యాధికారులకు తగు సలహాలు, సూచనలు చేశారు. ఆయుష్మాన్ భారత్, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు, జాస్ కమిటీలపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాజిదా, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ జ్యోతి, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ అతుల్ నిగమే, జిల్లా ప్రోగ్రాం అధికారి రవీందర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.




బతుకమ్మలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు

## బతుకమ్మ సంబురాలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 18: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ కే రవీందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పూజ, ఏ మాధవీలత, ఎం సతీశ్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 18: స్థానిక విట్స్‌లో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో విద్యార్థినులు బతుకమ్మను పేర్చి కళాశాల ఆవరణలో పెట్టి ఆడారు. విద్యార్థులకు బతుకమ్మ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ విజేతలకు నగదు, పురస్కారాలను కళాశాల అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మురళి అందజేశారు. కళాశాల ఏవో సాగి సుధాకర్‌రావు, ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విట్స్‌లో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

## ఆరోగ్య కేంద్రం సందర్శన



ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

గంగాధర, అక్టోబర్ 18: మండలంలోని గట్టుభూత్కూర్‌లో కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన గ్రూప్-ఏ అధికారులు శిక్షణలో భాగంగా మూడో రోజు బుధవారం స్థానిక పల్లె దవాఖానను సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద విలేజ్ సోషల్ మ్యాపును ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో వివిధ శాఖల పనితీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్హోత్రా, సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కాసారపు శైలజ-శ్రీకాంత్, కార్యదర్శి సార్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు, స్వశక్తి సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్యవర్గం ఎన్నిక

గంగాధర, అక్టోబర్ 18: గంగాధర మండల సెంట్రింగ్ సంఘం కార్యవర్గాన్ని బుధవారం మధురానగర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రజాక్, ఉపాధ్యక్షుడిగా మల్లేశం, కోశాధికారిగా సురేశ్, కార్యదర్శిగా స్వామి, గౌరవాధ్యక్షుడిగా లచ్చయ్య, కార్యవర్గ సభ్యుడిగా ఇస్మాయిల్‌ను ఎన్నుకున్నారు. కాగా, నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు సన్మానించి, అభినందించారు. ఇక్కడ సెంట్రింగ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అధ్యాపకుడికి అభినందన

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 18: ఎస్సారార్ కళాశాల అధ్యాపకుడు భాస్కర్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఆయనను బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ, అధ్యాపకులు ఎం శ్రీధర్, శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, జీవీఆర్ సాయి మధుకర్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్, ఓదెలుకుమార్, మల్లారెడ్డి, ప్రమోద్, టీజీసీజీటీఏ రాష్ట్ర కార్యదర్శి సురేందర్ రెడ్డి, రాజు, అర్చన, సతీశ్, సత్యనారాయణ, శంకర్, కిశోర్ అభినందించారు.

## మిర్చిసాగులో రైతు బాపురెడ్డి విధానం భేష్

చొప్పదండి, అక్టోబర్ 18: పట్టణానికి చెందిన రైతు బాపురెడ్డి మిర్చి సాగులో చేపడుతున్న విధానం బాగుందని ఉత్తమ యువ రైతు, రవి సీడ్స్ కరీంనగర్ రీజినల్ మేనేజర్ కట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బాపురెడ్డి సాగు చేస్తున్న మిర్చి పంటను బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, వాతావరణం, సమయానుకూలమైన పంటలను సాగు చేయడం ద్వారా మంచి దిగుబడి పొందవచ్చన్నారు. అధిక దిగుబడి సాధిస్తున్న బాపురెడ్డిని రైతులతో కలిసి శాలువాతో సత్కరించారు. కంపెనీ ప్రతినిధులు లింగమూర్తి, చందు, చాకుంట, వెదురుగట్ట, భూపాలపట్నం, ఫకీర్‌పేట రైతులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 18 : తెలంగాణ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు మూడోరోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పదో తరగతి పరీక్షకు 127 మంది విద్యార్థులకు గానూ 112 మంది, ఇంటర్ పరీక్షకు 142 మంది విద్యార్థులకు గానూ 121 మంది హాజరయ్యారు. ఈ కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ చల్వాజీ నాగేశ్వర్ రావు పేర్కొన్నారు.

## బస్టాండ్‌లో లక్కీ స్కీమ్ బాక్స్‌ల ఏర్పాటు

తెలంగాణచౌక్, అక్టోబర్ 18: బతుకమ్మ, దసరా పండుగల్లో ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రకటించిన లక్కీ స్కీమ్‌లో పాల్గొనే ప్రయాణికులు తమ టికెట్లను వేయడానికి జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో లక్కీ స్కీమ్ డ్రా బాక్స్‌లను బుధవారం ఏర్పాటు చేశారు. డిపో-1 మేనేజర్ లక్కు మల్లేశం మాట్లాడుతూ, ఆర్టీసీ అందిస్తున్న లక్కీ స్కీమ్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసిస్టెంట్ ట్రాఫిక్ కంట్రోలర్ రజనీకృష్ణ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 18: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సకేందర్‌రెడ్డి(26) హైదరాబాద్‌లో బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సకేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. వనస్థలిపురంలో సోదరి సంయుక్త ఇంట్లో ఉంటూ విధులకు హాజరవుతున్నాడు. బుధవారం తెల్లవారు జామున 5.30 గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై పని నిమిత్తం బయల్దేరిన సకేందర్‌రెడ్డి ఓ వ్యక్తి అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.